సెలవుల్లో స్కేటింగ్.. చిన్నారుల్లో జోష్

స్టేడియంలో సందడి

వేసవిలో సెలవులు రావడంతో ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఉన్న స్కేటింగ్ గ్రౌండ్ చిన్నారులతో కిటకిటలాడుతోంది. చిన్నారుల బుడి బుడి అడుగులతో స్కేటింగ్ శిక్షణలో నిమగ్నమవుతున్నారు. స్కేటింగ్ నేర్చుకునే విభాగంలో పడిలేస్తూ, తోటివారికి సాయపడుతూ శిక్షణ తీసుకుంటున్నారు. శాప్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా 14 ఏళ్ల లోపు చిన్నారులకు అడ్వాన్స్ రూ.వెయ్యి, నెలకు రూ.600 చొప్పున, 14 సంవత్సరాలు నిండిన వారికి అడ్వాన్స్ రూ.2 వేలు, నెలకు రూ.వెయ్యి చొప్పున ఫీజు నిర్ణయించామని చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్/ఏలూరు


స్కేటింగ్ పరుగులు తీస్తూ


పిల్లలకు స్కేటింగ్ శిక్షణ ఇస్తున్న కోచ్ ఖాసీం


కాస్త రిలాక్స్


పడిలేస్తూ


నేను సాయపడతా


స్కేటింగ్ మొదటిదశలో ఇలా..

క్లుప్తంగా

చేనేత ఐక్యవేదిక కరపత్రం విడుదల


చేనేత ఐక్యవేదిక సంఘం కరపత్రం విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాతీయ చేనేత ఐక్య వేదిక ఆధ్వర్యంలో సంఘం కరపత్రాన్ని స్థానిక పత్తేబాదలోని సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిచ్చుక సోమరాజు ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం కార్యక్రమాలు, కరపత్రంలోని అంశాలను సోమరాజు యూనియన్ నాయకులకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నార్ని అనిల్ కుమార్, ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షులు కొలసనం మధుబాబు, జిల్లా అధ్యక్షుడు వానపల్లి లక్ష్మి, ఏలూరు నగర అధ్యక్షుడు చింతా సుబ్బారావు, మాడా మల్లికార్జునరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన గంగానమ్మ తల్లి వార్షికోత్సవం


కలశాలతో చల్లచింతలపూడిలో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

దెందులూరు: చల్లచింతలపూడిలోని గంగానమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ముగిశాయి. తొలుత ఆలయ ఉత్సవ నిర్వాహకులు, ఆలయ అర్చకులు అమ్మవారికి విశేషాలంకరణ చేసి జలాభిషేకం చేసి పూజలు నిర్వహించి ప్రదక్షిణలు చేశారు. అనంతరం భక్తులు కలశాలతో కన్నులపండుగగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

ఆరువేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

పెదపాడు: రబీ సీజనులో 2,230 ఎకరాల్లో 6,000మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు ధాన్యం కొనుగోలు ప్రత్యేక అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూధనరావు తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు ఆర్‌బీకేను సందర్శించారు. అనంతరం ఆయన ఆయన మాట్లాడుతూ పెదపాడు మండలంలోని కొక్కిరపాడు, వట్లూరు, కలపర్రు ముప్పర్రు ప్రాంతాల్లో ధాన్యం సేకరణ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికి వరకు 2,379 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. త్వరలోనే మిగిలిన ధాన్యం కొనుగోలు చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి నిధుల మంజూరుకు కృషి


ఎంపీ శ్రీధర్‌ను కలిసిన నేతలు, సంఘ పెద్దలు

దెందులూరు: ఏలూరులో వెలమ కల్యాణ మండపానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ హామీ ఇచ్చారు. మంగళవారం ఎంపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, వెలమ సంఘ పెద్దలు మరడాని రంగారావు, కిలాడి దుర్గారావు, బొరపూడి శ్రీను, గొట్టాపు మోహనరావు, ఆర్నేపల్లి మధు కలిశారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని స్థలం కేటాయించారని, నిధులు మంజూరు చేస్తే త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ప్రసాద్ ఎంపీకి వివరించారు.

ఆధ్యాత్మిక మార్గం.. మానవాళికి శరణ్యం


ఆదిశంకరాచార్య చిత్రపటం వద్ద పూజ చేస్తున్న విశ్వబ్రాహ్మణ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జగద్గురు ఆదిశంకరాచార్యులు చూపిన ఆధ్యాత్మికమార్గం సర్వ మానవాళికి శరణ్యమని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం కన్వీనర్ అప్పలభక్తుల శివకేశవరావు అన్నారు. ఆదిశంకరాచార్యుల జయంతి కార్యక్రమం హేలాపురి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు గూడూరి హేమదుర్గా ప్రసాద్ అధ్యక్షతన స్థానిక కామాక్షి విశ్వబ్రాహ్మణ ధర్మపీఠంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివశ్రీ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని కాలడి అనే గ్రామంలో జన్మించిన శంకరులు చిన్నవయసులోనే బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఉపనిషత్తులకు భాష్యం రాశారని, ఇవి ప్రస్థానత్రయముగా ప్రసిద్ధిచెందాయని చెప్పారు. శంకరులు ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆచరించి చూపారన్నారు. ఈ ఇద్దరి జయంతి ఆరాధన మహోత్సవాలను ఆధ్యాత్మిక వారోత్సవాలుగా నిర్వహించుకోవాలని సూచించారు. తొలుత శంకరాచార్యుల చిత్రపటానికి పూజలు చేసి ప్రసాద వితరణ చేశారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి, కార్పెంటర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వేముల దుర్గాప్రసాద్ విశ్వబ్రాహ్మణ ఉద్యోగ, వ్యాపారస్థుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి లంకలపల్లి జగదీష్, ఉపాధ్యక్షుడు లక్కోజు కొండ, కోశాధికారి నాగమల్లి దుర్గారావు, పశ్చిమగోదావరి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు పొట్నూరి శివరావు, బ్రహ్మం గారి ఆలయ కమిటీ కార్యదర్శి ముశినాడ శేఖర్, యలబాక కృష్ణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నగర వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి రంగముత్యాలు, రాష్ట్ర యాదవ సంఘం ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- రామచంద్రరావు పేట శంకర మఠంలో దిశంకరాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. చంద్రమౌళీశ్వర స్వామి వారి పంచాయతనానికి, ఆదిశంకరులకు, గాయత్రీ మాతకు, దత్తాత్రేయ స్వామి వారికి విఘ్నేశ్వర పూజ, మహన్యాసం, ఏకాదశ రుద్రాభిషేకం, అర్చన, కుంకుమ పూజ, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి


మహాసభలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రోజా

ఏలూరు (టూటౌన్): పెరుగుతోన్న నిత్యావసర వస్తువుల ధరలకనుగుణంగా అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.రోజా కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ ఏలూరు జిల్లా 8వ మహాసభ మంగళవారం ఎండీ హసీనా బేగం, పి.సుజాత, రాజేశ్వరిల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో రోజా మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాలు తక్షణమే పెంచాలని, వారిపై పర్యవేక్షణ పేరుతో వేధింపులకు పాల్పడటం అన్యాయమని అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మెనూ చార్జీలను సరిపడా ఇవ్వకుండా వారిపై భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌ను నిర్వీర్యం ప్రయత్నిస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు రోజు రోజుకు తగ్గిస్తోందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్‌లు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు బిల్లు బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు గ్రాట్యుటీ ఇవ్వాలని, రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలన్నారు. మహాసభలో కె.విజయలక్ష్మి, పి.హైమావతి, పీఎల్ఎస్ కుమారి, బీజెఎస్ కుమారి, విమల, సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గరుడ వాహనోత్సవం


గరుడ వాహనంపై ఉన్న వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి 34వ వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి గరుడ వాహనోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. భగవద్రామానుజ తిరు నక్షత్రం సందర్భంగా విశేష పంచామృత అభిషేకం, శాత్తుమొరై నిర్వహించారు. సకల శతృ నివారనార్థం సుదర్శన నారసింహేష్టి (హోమం), మంగళాశాసనాలు, తీర్థ ప్రసాద వితరణగావించారు. సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచన, చతుఃస్థానార్చన, మూలమంత్ర హవనాలు, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి 7 నుంచి స్వామి వారి గరుడ వాహనోత్సవం నిర్వహించి మంగళాశాసనాలు పలికి తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ట్రస్టుబోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు, భక్తులు పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

దోమ కాటుతో ప్రాణాంతక వ్యాధులు

డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఆశ


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఆశ, డీసీహెచ్ఎస్ ఏవీఆర్ మోహన్

ఏలూరు టౌన్: దోమ కాటు ద్వారా ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి.ఆశ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రిలో నర్సింగ్ విద్యార్థులు, సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆశ మాట్లాడుతూ మలేరియా ప్రపంచవ్యాప్తంగా 106 దేశాల్లో సమస్యాత్మకంగా ఉందని, దీన్ని నిర్మూలించడానికి అన్ని శాఖల సహకారం కావాలని అన్నారు. దోమల నియంత్రణకు దోమల మందు పిచికారీ, సాయంత్రం పొగ వదలడం, గంబూసియా చేపలు వదలడం, దోమ తెరలు వాడడం, సాయంత్రం కిటికీలు వేయడం ద్వారా దోమ కాటు నుంచి సంరక్షించుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఏవీఆర్ మోహన్ మాట్లాడుతూ జ్వరం వస్తే అశ్రద్ధ చేయవద్దని మలేరియా సంబంధిత పరీక్షలు ఉచితంగా చేస్తామని, మలేరియా కిట్స్ అన్ని సిద్ధంగా ఉన్నాయని, మలేరియాకు మందులు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ దోమ లార్వా దశలోనే నిర్మూలిస్తే మలేరియాను తగ్గించుకోవచ్చని, చలి జ్వరం, కెమెరామెన్ తలనొప్పి చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే మలేరియా వ్యాధి కావచ్చని, వెంటనే వైద్యుని సంప్రదించాలన్నారు. మలేరియా జ్వరం ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల వస్తుందని, ఈ దోమ పెరిగే వాతావరణం గిరిజన ప్రాంతంలో అనుకూలంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రత్నకుమారి, డీపీఎంఓ డాక్టర్ బీఈఎస్ జ్యోతి, హెచ్‌డబ్ల్యూసీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణచంద్రరావు, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, డెమో నాగరత్నం, విజయ్, శాస్త్రి, ఎంపీహెచ్ఈఓ బసవరాజు, రవికుమార్, ప్రభాకర్ హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణ, నరేంద్ర, సుబ్రహ్మణ్యం, హెల్త్‌అసిస్టెంట్స్ రమేష్, శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి నుంచి రూ.70 వేలు అందజేత

పెదవేగి : కార్యకర్తకు అండగా నిలిచిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన దెందులూరు బహిరంగ సభ కార్యక్రమంలో పెదవేగి మండలం అమ్మపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మరీదు నాగరాజు గాయపడి ఆసుపత్రిలో చేరగా, అదే రోజు అతడిని పరామర్శించి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను అందజేశారు. అనంతరం, నాగరాజు పూర్తిగా కోలుకోవడానికి మరింత సాయం అవసరం అని తెలుసుకొని, అదనపు వైద్య ఖర్చుల కోసం మరో రూ.70 వేలు ఎమ్మెల్యే మంగళవారం స్థానిక నాయకుల ద్వారా అందజేశారు. నాగరాజు కోలుకోవడానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఔదార్యాన్ని ప్రజలు ప్రశంసిస్తున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, తహసీల్దార్ నాంచారయ్య, నాయకులు పాల్గొన్నారు.

మేడేని విజయవంతం చేద్దాం


మేడే పోస్టర్‌ను విడుదల చేసిన ఆటో డ్రైవర్లు

ఏలూరు (టూటౌన్): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి పిలుపునిచ్చారు. స్థానిక పాత బస్టాండ్ పరిధిలోని ప్రగతి ఆటో స్టాండ్ వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మేడే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ మేడే విశిష్టతను వివరించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 లేబర్ చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని, కార్పొరేట్ పెట్టుబడిదారులకు కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడాన్ని కార్మిక వర్గం అంతా తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. రవాణా రంగంపై ఏటా రూ.3 లక్షల కోట్ల ఆదాయాన్ని సంపాదించి పెడుతున్నారని, కనీసం రూ.20 వేల కోట్లు రవాణా రంగ కార్మికుల సంక్షేమానికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ఎం.ఇస్సాక్, ఆటో యూనియన్ అధ్యక్షుడు నల్ల పాపినీడు, బొల్లా నాని, ఉరమల సురేష్, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	31
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	28
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	26
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	29
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	32
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు – బెంగళూరు	14.00	4021	--
ఏలూరు –తిరుపతి	16.00	4830	33

పలు అభివృద్ధి పనుల ప్రారంభం


రైతు భరోసా కేంద్ర శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల : తమ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బుట్టాయిగూడెంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, గుళ్లపాడులో రూ.5 లక్షలతో నిర్మించిన మంచినీటి బోరును, నారాయణపురంలో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే గుళ్లపాడులో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్‌లు పెద్దిన దిలీప్, కేతా వెంకట నాగ సుబ్రహ్మణ్యం, దాకారపు బంగారమ్మ, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు పెండ్యాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో మంచినీటి ఎద్దడి ఉండకూడదు

ద్వారకాతిరుమల : ప్రస్తుత వేసవిలో ఏ గ్రామంలోను మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వెంకట్రావు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బొండాడ మోహిని అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే తలారి ముఖ్య అతిథిగా పాల్గొని, అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అందులో భాగంగా వెంకటకృష్ణాపురం, ఐఎస్ రాఘవాపురం ఎస్సీ కాలనీల్లో, దొరసానిపాడు, సాయన్నపాలెం, బుట్టాయిగూడెంలోని రెండు ప్రాంతాల్లో నిర్మించిన బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కొమ్మరలో బోరుకు నూతన మోటారును ఏర్పాటు చేస్తామని, అలాగే కోడిగూడెం బీసీ కాలనీలో నూతన బోరును మంజూరు చేస్తామన్నారు. పంగిడిగూడెంలో ప్రభుత్వ ఇళ్ల స్థలాల లేఅవుట్ మీదుగా వెళ్లిన 33 కేవీ విద్యుత్ లైన్‌ను షిఫ్ట్ చేయాలన్నారు. మండలంలో ఇంకా 546 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉందన్నారు. భూమి కొనుగోలు చేసైనా వారికి త్వరలో స్థలాలు ఇస్తామన్నారు. దొరసానిపాడు, తిరుమలంపాలెం గ్రామాల్లో లేఅవుట్‌లపై ఉన్న కోర్టు వివాదాలు తొలగిపోయాయన్నారు. త్వరలో అక్కడి లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. ఎంపీడీఓ ఏవీ సుబ్బరాయన్, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైస్ ఎంపీపీ ఓగిరాల చంద్ర, తదితరులు పాల్గొన్నారు.